Nabiyon-ke-Halaat-I
(Telugu)

దైవ ప్రవక్తలు

మొదటి భాగం

మూలం:

మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం:

షేఖ్ హమీదుల్లా షరీఫ్, బి.ఏ.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

మా మాట

కాపిటలిజం, కమ్యూనిజం, సోషలిజం, సెక్యులరిజం, రాడికల్ హ్యూమనిజం అనే సిద్ధాంతాలు ఎంతోకాలం నుండి ప్రపంచంలో నలుమూలలా విరివిగా ప్రచారంలో ఉన్నాయి. కాని ప్రపంచ పరిస్థితులు మాత్రం వేసిన చోటనే ఉండే గొంగళిలాగే ఉన్నాయి. ఉన్న సమస్యలు చాలవని, కొత్త సమస్యలు ఉత్పన్నమై కోర త్రాచుల్లా పడగలెత్తి బుసలు కొడుతున్నాయి. "చిర కాలం జరిగిన మోసం, బలవంతుల దౌర్జన్యాలూ, ధనవంతుల పన్నాగాలూ" ఇంకా చలామణి అవుతూనే ఉన్నాయి. నిజమయిన స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం, సౌహార్ధం అద్దంలో అగుపించే చందమామలాగే ఉండిపోయాయి. ఎటు చూచినా జాతి కలహాలు, మత కలహాలు, రాజకీయ కలహాలు, ప్రాంతీయ కలహాలు విజృంభించి, దౌర్జన్యాలు, లూటీలు, కాల్పులు, హత్యలు వికటాట్టహాసం చేస్తూ ప్రపంచ రంగం నానాబీభత్సంగా తయారయింది. ఈ అనర్థాలకు, ఈ అత్యాచారాలకు, ఈ దురాగతాలకు అసలు కారణం, పై సిద్ధాంతాలు ప్రజలకు ఒక సమగ్రమయిన జీవిత విధానాన్ని, నియమావళిని ఇవ్వలేకపోవడం! వాటిని అనుసరించి ఆచరిస్తూ వచ్చిన ప్రజలు నిరాశా నిస్పృహలకు లోనయ్యారు. వారు సుఖశాంతుల్ని ప్రసాదించే, సత్యం, ధర్మం, న్యాయం పునాదులుగా ఉండే జీవన విధానాన్ని కాంక్షిస్తున్నారు. దాని కోసం తల్లడిల్లిపోతున్నారు.

విజ్ఞత, వివేకం ఉన్నవాళ్ళు; ఇహంలో, పరంలో సౌఖ్యాన్ని కోరేవాళ్ళు. మంచి విషయాన్ని ఎవరు చెప్పినా, ఎప్పుడు చెప్పినా, ఎక్కడ చెప్పినా

ఆకళించుకుని ఆదరిస్తారు. అలాంటి వారికి కులం, మతం, దేశం, జాతి అడ్డుగోడలుగా ఉండవు.

దేవుడు ఈ ప్రపంచాన్ని, మానవుల్ని ఒక ఉద్దేశ్యంతో, ఒక లక్ష్యంతో సృష్టించాడు. మానవుడు సుఖంగా ఉండటానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేశాడు. మంచి చెడుల్లో, దుర్మార్గం సన్మార్గాల్లో విచక్షణ చేసే బుద్ధిని, జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆచరణయోగ్యమయిన జీవిత విధానాన్ని, నియమావళిని తన ప్రవక్తల ద్వారా అందజేశాడు. దేవుడ్ని విశ్వసించి, ఆయన ప్రవక్తల ద్వారా పంపిన ఉపదేశాలను నమ్మి, తదనుగుణంగా జీవించినవారికి ఇక్కడా, అక్కడా రెండు లోకాల్లో సుఖం, శాంతి, మోక్షం లభిస్తాయి. ఆ విధంగా చేయనివాళ్ళు ఇక్కట్లకు గురి అవుతారు. దైవ ప్రబోధాల్ని జీవితానికి సంబంధించిన కొన్ని విషయాల్లో మాత్రమే ఆచరించి, ఇతర సందర్భాల్లో ఆ విధంగా చేయకపోతే ఫలితాలు మృగ్యం; అంటే జీవితాన్ని Compartmentalగా విభజించకూడదు. ఒకే మనిషి Dr. Jekil & Mr. Hyde గా ఉండటానికి వీల్లేదు. ఇంటా, బయటా ఒకే ధర్మాన్ని, ఒకే నియమాన్ని ఆదరించాలి. రాజకీయాల్లో, పరిపాలనా వ్యవహారాల్లో, సాంఘిక సమస్యల్లో, వ్యాపార విషయాల్లో, వ్యక్తిగత విషయాల్లో, మత సంబంధమయిన విషయాల్లో- ఒకటేమిటి అన్ని విషయాల్లో, అన్ని సందర్భాల్లో ఒకే విధంగా జీవించాలి. అప్పుడే మానవ జీవితం సఫలమవుతుంది. నిజమైన శాంతి లభిస్తుంది.

ఈ సందేశాన్నే, ఈ సిద్ధాంతాన్నే, ఈ విధానాన్నే దైవ ప్రవక్తలు వివిధ కాలాల్లో, వివిధ దేశాల్లో ప్రచారం చేశారు. అదే అదొక్కటే "కదిలేదీ, కదిలించేదీ, మునుముందుకు సాగించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ."

దాన్ని మీరూ పొందలేరూ? చెప్పటం మా ధర్మం.

-ప్రకాశకులు

హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలాం)

ఎల్లప్పుడూ అందంగా, అద్భుతంగా, అపూర్వంగా కనిపించే ఈ భూలోకం ఒక మహోజ్వలమయిన దైవ సృష్టి. ఇప్పుడు మానవ లోకంగా అలరారుతున్న ఈ గోళంలో ఒకప్పుడు మానవ జాతి లేదు. మానవుణ్ణి సృష్టించి ఈ భూమండలానికి పంపుదామనే సంకల్పం కలిగింది సృష్టికర్తకు. తత్ఫలితంగా ఆది మానవుణ్ణి సృష్టించాడు కరుణామయుడైన దేవుడు. ఆ మానవుణ్ణి మట్టితో సర్వాంగ సుందరంగా తయారుచేసి ప్రాణం పోశాడు. ఆ ఆది మానవుడే హజ్రత్ ఆదమ్ (అ). మీరు, మేము అంతా ఆయన సంతానమే.

మానవుల కంటే ముందే, దేవుడు జిన్నులను, దేవదూతల్ని సృష్టించాడు. ఆది పురుషుడయిన ఆదమ్(అ)ను సృష్టించే ముందు దేవుడు దేవదూతలను ఉద్దేశించి, "మేము ఆదమ్(అ)ను సృష్టించి మా ప్రతినిధిగా భూలోకానికి పంపదలచినాము" అన్నాడు. ప్రతినిధి లేక ఖలీఫా అంటే ఎవరో మీకు తెలుసా? ఉదాహరణకు, మీరు ఒక పెద్ద ఆస్తికి యజమానులనుకోండి. ఆ ఆస్తికి సంబంధించిన వ్యవహారాలను చూడడానికి ఒక మనిషిని పంపిస్తూ, చేయవలసిన పనిని గురించి అతనికి మీరు కొన్ని ముఖ్యవిషయాలు తెలుపుతారు. ఆ విధంగా మీరు పంపే ఆ వ్యక్తే మీకు ఖలీఫా లేక ప్రతినిధి. ఈ భూమిపై మానవుణ్ణి తన ఖలీఫాగా దేవుడు ఇదే ఉద్దేశ్యంతో సృష్టించాడు. ఈ లోకానికి అసలు అధిపతి. యజమాని దాన్ని సృష్టించిన దైవం. మానవుడు ఆ దైవానికి ఖలీఫా లేక ప్రతినిధి. కనుక, మనిషి నియమిత కార్యాన్ని సాధించటానికి భువికి పంపబడ్డాడు. ఆ కార్యనిర్వహణకు, ఆ లక్ష్య సాధనకు అవసరమయిన ముఖ్య విషయాలన్నింటిని తెలిపాడు దేవుడు. కనుక మానవుడు తన జీవిత లక్ష్యాన్ని గ్రహించి, తాను చేయవలసిన పనిని దైవాజ్ఞానుసారం చేయాలి. ఎవరయితే ఆ

విధంగా చేస్తారో, వారే ఖలీఫాకున్న బరువుబాధ్యతలను నిర్వహించినవారవుతారు. వారి జీవితమే సార్ధకం.

మానవుణ్ణి సృష్టించి, తన ప్రతినిధిగా భూలోకానికి పంపదలచినట్లుగా అల్లాహ్ దేవదూతలకు తెలుపగానే వారు భయాందోళనలు చెంది ఎంతో వినమ్రతతో, "మహాప్రభూ! కల్లోలాన్ని రేపి, రక్తాన్ని చిందించే ఈ మానవుణ్ణి నీ ప్రతినిధిగా నియమిస్తావా? నీ మహిమను, నీ కీర్తిని ఎల్లవేళలా కీర్తిస్తూ, నీ సేవలో నిమగ్నులమై ఉన్నామే!" అన్నారు. అప్పుడు సర్వజ్ఞుడయిన దేవుడు వారితో అన్నాడు, "మాకు తెలిసిన విషయాలు మీకు తెలియవు. మానవ సృష్టిలో మేము ఏ అపూర్వశక్తుల్ని ఉంచామో మీకు తెలియదు. ఇతడు భూలోకానికి పోయి మాచే ప్రసాదితమయిన జ్ఞానాన్ని, శక్తిసామర్థ్యాలను ఉపయోగించి మా గర్భంలో దాగి ఉన్న నిధుల్ని వెలికితీస్తాడు, మేము సృష్టించిన వస్తువుల్ని ఉపయోగిస్తాడు. మీకు ఈ విషయాలు తెలుసేమో చెప్పగలరా?" పాపం, దేవదూతలకు ఈ రహస్యాలన్నీ తెలియవుగా! అప్పుడు వారు వినయ విధేయతలతో, " ఓ ప్రభూ! నీవు తెలిపిన విషయాలుతప్ప మాకు మరే ఇతర జ్ఞానమూ లేదు. నీవు సర్వమూ తెలిసినవాడవు, ప్రజ్ఞానిధివి" అన్నారు.

తరువాత సృష్టికర్త ఆదమ్ (అ)తో, "ఆదమ్! ఈ వస్తువుల స్వరూప స్వభావాలను తెలుపు" అని ఆజ్ఞాపించాడు. (హజ్రత్ ఆదమ్(అ)ను సృష్టించినపుడే భూలోకంలో ఉన్న సమస్త వస్తువుల స్వరూప స్వభావాలను అవగాహన చేసుకునే వివేకాన్ని దేవుడు ఆయనకు ప్రసాదించాడు) దైవాజ్ఞానుసారంగా, హజ్రత్ ఆదమ్(అ) అన్ని విషయాలను గురించి తెలుపగా అల్లాహ్ దేవదూతలతో ఈ విదంగా అన్నాడు, "భూమ్యాకాశాల్లో దాగి ఉన్న సమస్త రహస్యాలు మాకు తెలుసని మేము మీకు తెలిపియుండలేదా? మీరు ప్రకటించేవీ, దాచేవీ అన్నీ మాకు తెలుసు."

దైవదూతలందరూ హజ్రత్ ఆదమ్(అ)పట్ల గౌరవసూచకంగా ఆయన ఎదుట సాష్టాంగపడవలసిందిగా అల్లాహ్ ఆదేశిస్తాడు. ఆ సమయంలో అక్కడ షైతాన్ కూడా ఉంటాడు. దైవాజ్ఞ అయినంతనే, దైవదూతలందరూ ఒక్కుమ్మడిగా ఆదమ్(అ)కు సాష్టాంగపడతారు. కాని షైతాన్ నిరాకరిస్తాడు, దైవాజ్ఞను ఉల్లంఘిస్తాడు. అహంభావం అతనిచే తిరుగుబాటు చేయిస్తుంది. గర్విష్ఠి అయిన షైతాన్ పరోత్పరునితో, "ప్రభూ! మట్టితో సృజించబడ్డ ఈ మానవునికి నేను సాష్టాంగపడను. నేను అతనికంటే అధికుణ్ణి. నీవు నన్ను అగ్నితో సృష్టించావు' ' అన్నాడు. షైతాన్ చూపిన ఆ ధిక్కారం వల్ల అతడు దైవాగ్రహానికి లోనవుతాడు. దురహంకారి అయిన షైతాన్‌ను అల్లాహ్ తన దర్బారు నుండి బహిష్కరిస్తాడు. ప్రళయకాలం వచ్చే వరకు భూలోకం షైతాన్‌కు స్థావరం అవుతుంది. తీర్పుదినంనాడు షైతాన్, అతని ఉపదేశాలను పాటించినవారు నరకవాసులవుతారు.

హజ్రత్ ఆదమ్(అ)కు తోడుగా ఉండటానికి ఒక స్త్రీ మూర్తిని కూడా దేవుడు సృష్టించాడు. ఆమె పేరు హవ్వా(అ). హజ్రత్ హవ్వా(అ) మానవులందరికీ మాత. ఆదమ్, హవ్వాలు భగవదాజ్ఞానుసారం స్వర్గలోకంలో నివసిస్తూ ఉంటారు. స్వర్గంలో అన్ని సుఖాలు ఉంటాయి. తినటానికి అత్యంత రుచికరమైన పండ్లూ ఫలాలు, త్రాగటానికి మధుర పానీయాలు, విశ్రాంతికి, విహారానికి కావలసిన అన్ని హంగులూ ఉంటాయి. స్వర్గలోకంలో, కరుణామయుడయిన దేవుడు వారితో, "మీరు ఈ స్వర్గలోకంలో హాయిగా జీవించండి. మీకు ఏది అవసరమో దాన్ని తృప్తికరంగా తినండి, త్రాగండి కాని (ఒక వృక్షాన్ని చూపుతూ) ఆ చెట్టు దరిదాపులకు పోకూడదు. దాని వల్ల మీకు ఏ ప్రయోజనమూ లేదు" అని ఆజ్ఞాపించాడు; ఆది మానవులిద్దరూ స్వర్గలోకంలో సుఖంగా ఆనందడోలికల్లో ఊగుతూ జీవిస్తూ ఉండేవారు.

బహిష్కరింపబడిన షైతాన్ తీవ్ర ఆత్మసంక్షోభానికి, బాధకు గురి అయ్యాడు. చేసిన తప్పును ఒప్పుకొని, పశ్చాత్తాపపడి, క్షమాభిక్ష పెట్టమని దయామయుడయిన భగవంతుణ్ణి వేడుకోవలసింది. కాని అతడు ఆ విధంగా చేయలేదు. తన పతనానికి ఆదమ్, హవ్వాలే కారణమని తలంచి, వారిపై పగ పట్టాడు; ప్రతీకారం చేయదలచాడు, "ఫలానా వృక్షాన్ని తాక వద్దు" అని ఆదమ్, హవ్వాలను దేవుడు ఆదేశించిన విషయం షైతాన్‌కు తెలుసు. ఒక రోజున, అమాయకత్వం ఉట్టిపడే ముఖంతో, సాధుత్వం నటిస్తూ వారి దగ్గరకు పోయి, తన కపట నాటకాన్ని ప్రారంభిస్తాడు షైతాన్. "స్వర్గంలో ఉన్న ఐశ్వర్య సంపదలనన్నింటినీ మీకు యిచ్చి, ఒకే ఒక వృక్షాన్ని ముట్టుకోవద్దని దేవుడు ఎందుకు నిషేధించాడో మీకు తెలుసా? అసలు విషయం ఏమంటే, ఈ వృక్షం చాలా మహత్తు కలది. దీని ఫలాన్ని సేవించిన వారికి చావురాదు. మీరు దీని ఫలాన్ని తిన్నట్లయితే అమరులవుతారు; దేవదూతలవుతారు. నేను ప్రమాణం చేసి చెపుతున్నాను. నేను మీ మిత్రుణ్ణి, మీ యోగ క్షేమాలను కోరేవాణ్ణి కనుకనే ఈ రహస్యాన్ని మీకు తెలియజేస్తున్నాను"అని షైతాన్ అమాయకులయిన ఆదమ్, హవ్వాలను దైవాజ్ఞను ధిక్కరించమని ప్రేరేపిస్తాడు.

అమాయకునిగా, సాధుపుంగవునిగా, కపట నాటకమాడిన షైతాన్, వారికి బద్ధవిరోధి, గోముఖవ్యాఘ్రం అని ఆదమ్, హవ్వాలకు తెలియదు పాపం! షైతాన్ పన్నిన పన్నాగం ఫలించింది. అతని మోసానికి వారిద్దరు గురి అయ్యారు. దేవుని నిషేధాజ్ఞలను ఉల్లంఘించారు, ఆ వృక్ష ఫలాన్ని వారు సేవించారు. తత్‌క్షణమే వారి శరీరాలపై ఉన్న వస్త్రాలు మాయమయ్యాయి. ఆది మానవులు దిగంబరులయ్యారు. భయభీతచిత్తులై వారు తమ దేహాన్ని చెట్ల ఆకులతో కప్పుకున్నారు. అప్పుడు వారు ఘోరపాపం జరిగిపోయిందని వాపోయారు. వారి ప్రభువు వారిని అగ్రహించాడు.

చేసిన పాపానికి పరితపిస్తూ, పశ్చాత్తాపంతో విలపిస్తూ తమను క్షమించమని దేవుణ్ణి వేడుకున్నారు. షైతాన్ మాదిరిగా వారు గర్వపడలేదు. చేసిన నేరాన్ని ఒప్పుకొని, మన్నించమని దైవాన్ని అర్థించారు. అత్యంత దయామయుడయిన దేవునికి వారి వైఖరి నచ్చింది. దైవం వారిపై దయచూపి వారిని మన్నించాడు. "షైతాన్ మీకు బద్ధ శత్రువు. ఇకముందు అతని మాటలకు మోసపోవద్దు" అని అల్లాహ్ వారికి తెలిపాడు.

అపుడు ఆదమ్, హవ్వాల నివాసం భూలోకానికి మారింది. దైవం వారితో, "కొంతకాలం మీరు భూలోకంలో నివసించండి. నా సంతోషానికి దోహదమయ్యే అన్ని పనుల్ని చేయండి" అని దైవ సంతోషాన్ని పొందటానికి చేయవలసిన పనులన్నింటిని గురించి తెలిపాడు. ఆ విధంగా భూమండలానికి హజ్రత్ ఆదమ్ తొలి మానవునిగా, మొదటి దైవప్రవక్తగా ఆవిర్భవిస్తారు.

"మీలో మంచి పనులు చేసిన వారు, తాము దైవ ప్రతినిధులమని భావించి తదనుగుణంగా తమ జీవితాన్ని తీర్చిదిద్దుకున్నవారు, మరణించి మా వద్దకు మరలి వచ్చినపుడు వారికి మేము మళ్ళీ స్వర్గం అనుగ్రహిస్తాము. మా మార్గాన్ని అవలంబించనివారు షైతాన్ అనుచరులు, వారందరు షైతాన్‌తో పాటు నరకానికి పోవలసి ఉంటుంది" అని సర్వేశ్వరుడు వారికి మహోపదేశం చేశాడు.

జ్ఞాపకం ఉంచుకోవలసిన ముఖ్య విషయాలు

1. మనిషి ఎల్లప్పుడూ మనిషే. మన పూర్వులు అంటే మన తండ్రుల తాతల తాతముత్తాతలు కోతులవంటి జంతువులుగా ఉండేవారని, వారు క్రమేణా మార్పు చెందుతూ మానవులయ్యారనే పరిణామవాదాన్ని ప్రవేశపెట్టిన

శాస్త్రజ్ఞుల సిద్ధాంతాలు నిరాధారాలు, అభూత కల్పనలు, పాపం; ఈ ప్రబుద్ధులు మోసపోయారు. దైవ కాంతి కిరణాలు చొరబడని బుర్రలూ, బుద్ధులూ వీళ్ళవి. మానవులందరు ఆది మానవుడయిన హజ్రత్ ఆదమ్ సంతతివారే.

2. తప్పు చేయడం సహజం. పొరపాట్లు చేయకుండా ఉండేదెవరు? తప్పు చేసిన తరువాత, పశ్చాత్తాపపడటం, క్షమాపణ వేడుకోవడం బుద్ధిఉన్న ప్రతి మనిషీ చేయవలసిన పని, పశ్చాత్తాప పరితప్త హృదయులయిన వాళ్ళందరినీ దేవుడు ప్రేమిస్తాడు, కరుణిస్తాడు, క్షమిస్తాడు. చేసిన తప్పును ఒప్పుకోవడం తమ గౌరవానికే భంగమని విర్రవీగేవారు మూర్ఖులు, షైతాన్ సహచరులు. అలాంటి వారు దుష్టుడయిన షైతాన్‌తోపాటు నరకాగ్నిని చవిచూడవలసి ఉంటుంది.

3. భూలోకానికి విచ్చేసిన ఆది మానవుడు ప్రథమ దైవప్రవక్త. మానవులు తినటానికి, త్రాగటానికి, ఉండటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసినట్లే జీవితం గడపటానికి సరియైన సత్యమయిన రుజుమార్గాన్ని చూపాడు.

4. భూమిపై మానవుడు దైవప్రతినిధిగా జీవించాలి. దేవుడు మనకిచ్చిన వరాలను, కానుకలను ఆయన కోరిన విధంగా వినియోగపరచాలి. ఇలలో వున్న ఏ వస్తువుకూ మానవుడు యజమాని కాదు. మనిషి విశృంఖలంగా జీవించటానికి వీల్లేదు. ఈ లోకం దైవానిది. కనుక అధికారం. ఇష్టం, శాసనం దైవానికి చెందినవే చలామణి కావాలి.

5. దైవోపదేశాలకు, దైవాదేశాలకు అనుగుణంగా జీవించే మానవులు అసలయిన దైవభక్తులు. ఇలాంటివారికే పరలోకంలో స్వర్గప్రాప్తి. దేవుని ఉనికిని తిరస్కరించేవారు, దైవప్రతినిధిగా తమకున్న కర్తవ్యాన్ని నిర్వహించనివారు దైవాగ్రహానికి గురి అవుతారు. పరలోకంలో వారికి నరకం సంప్రాప్తమవుతుంది.

హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)

ఆది మానవులైన ఆదమ్, హవ్వా(అ)లు భూలోకంలో చాలాకాలం వరకు నివసించారు. వారికి సంతానం కూడా చాలా మంది కలిగారు. వారి సంతతి భూమికి నలువైపులా వ్యాపించింది. దూర దూర ప్రాంతాల్లో నివాస స్థలాలు ఏర్పరచుకొని జీవించసాగారు. కొంతకాలం వరకు వారందరికీ హజ్రత్ ఆదమ్(అ) బోధించిన విషయాలన్నీ జ్ఞాపకం ఉన్నాయి. వారి జీవితాలు కూడా ఆదమ్(అ) ఉపదేశాలకనుగుణంగానే గడిచాయి. కాని క్రమేణా ఆదమ్(అ) వారికి ఇచ్చిన సందేశాన్ని, జీవిత విధానాన్ని వారు మరిచిపోసాగారు. దేవుణ్ణి మరచి, వారు తమ తమ పెద్దల్ని విగ్రహాలుగా చేసుకొని పూజించటం ప్రారంభించారు. ఏ వస్తువు వల్లనన్నా వారికి భయంగాని లేక ప్రయోజనంగాని కలిగినప్పుడు దాన్నే తమ ఆరాధ్య దైవంగా భావిస్తూ పూజిస్తూ వచ్చారు.

వారి ఈ దుస్థితికి, దేవుడు వారిపై జాలిగొని వారికి రుజుమార్గం చూపటానికి, తన దాసుడయిన హజ్రత్ నూహ్(అ)ను ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ప్రవక్త అంటే ఎవరో మీకు తెలుసా? అల్లాహ్ భువిలోని తన దాసులకు తన ఉపదేశాలను, అభీష్టాన్ని తెలుపడానికి వారి నుండి ఒకర్ని తన సందేశహరులుగా ఎన్నుకుంటాడు. ఆ విధంగా దైవం నియమించిన వ్యక్తులు, దైవం వారికి తెలిపిన మాటలను మానవులందరికీ తెలుపుతారు. వారికి ఆ దైవ మార్గంపై ఎలా నడవాలో ఆచరించి చూపిస్తారు. అలాంటి సత్పురుషుల్నే మనం ప్రవక్తలు లేక దైవ సందేశహరులు అని అంటాము. దైవ ప్రవక్తలు ప్రభవించని దేశం, దైవ సందేశం తెలుపబడని జాతి లేదు.

హజ్రత్ నూహ్(అ) దుర్మార్గంలో కూరుకుపోయిన తన జాతిని సన్మార్గం వైపునకు ఆహ్వానించాడు. చెడు పనుల్ని చేయవద్దని చేయిపట్టి అపాడు.

బూటకపు దైవాలను, ప్రాణంలేని విగ్రహాలను ఆరాధించవద్దని ప్రబోధించాడు. "ప్రియ సోదరులారా! అల్లాహ్‌కు విధేయులయి జీవించండి. ఆయనే నిజమయిన దేవుడు. ఆయన్నే పూజించండి. అల్లాహ్ తప్ప ఇతరుల్ని పరిత్యజించండి, దేవుడు కరుణామయుడు. మీ తప్పుల్ని క్షమిస్తాడు. మీకు ఇహలోకంలో గౌరవాన్ని, పరలోకంలో మోక్షాన్ని ప్రసాదిస్తాడు" అని హజ్రత్ నూహ్(అ) ఉద్బోధించాడు.

అల్లాహ్‌ను తన ప్రభువుగా అంగీకరించి, ఆయన ఆదేశానుసారంగా జీవించే మనిషి, తన ఇష్టానుసారంగా అంటే బుద్ధికి తోచిన విధంగా ఏ పనీ చేయడు. ఇతరుల యెడ క్రూరంగా ప్రవర్తించటంగాని, వారికి అన్యాయం చేయడంగాని దైవ భయం ఉన్న మనిషి వల్ల జరుగవు. ఇంకా విశృంఖలంగా జీవించటానికి, విచ్చలవిడిగా ప్రవర్తించటానికి ఆ వ్యక్తి బరితెగించడు. అతను ఒక మంచి మనిషిగా ఇతరులకు మార్గదర్శిగా జీవించవలసి ఉంటుంది. సత్యం కోసం, న్యాయం కోసం, తన ప్రాణాల్ని కూడా త్యాగం చేయవలసి ఉంటుంది. స్వార్థం, స్వలాభాపేక్ష ఉన్న మనిషి ఈ పనుల్ని, త్యాగాల్ని చేయగలడా? హజ్రత్ నూహ్(అ) జాతి ఎన్నో రుగ్మతలకు ఆలవాలమయింది. వారు ఎంతగా దూరమయ్యారంటే, మళ్ళీ వారిని రుజువర్తనులుగా, దైవభక్తులుగా, మంచి మానవులుగా మార్చటం దుర్భరం, దుస్సాధ్యం అనిపించేది. హజ్రత్ నూహ్(అ) వారికి దైవోపదేశాలను వినిపించేటప్పుడు, చెవుల్లో వ్రేళ్ళు పెట్టుకునే వారు. దైవానికి ఇష్టమయిన పనులు చేయమని ఆహ్వానించినపుడు వెనుదిరిగి వెళ్ళేవారు. ఏవేవో సాకులు చెప్పి తప్పించుకునేవారు. వారిని సజ్జనులుగా, దైవధర్మపరాయణులుగా చేయటానికి ఎన్నోవిధాల ప్రయత్నం చేశాడు దైవ ప్రవక్త నూహ్(అ). బహిరంగ సభలలో, పురవీధులలో విసుగు విరామం లేకుండా దైవ సందేశాన్ని ప్రబోధించాడు. వారి ఇళ్ళకుపోయి ప్రతివారిని కలుసుకొని అసలువిషయం విపులంగా అర్థమయ్యేటట్లు చెప్పడానికి కృషి చేశాడు. తమను సృష్టించినవాణ్ణి, పరిపోషిస్తున్నవాణ్ణి ధిక్కరించవలదని, ఆయన

సన్నిధానంలో సాష్టాంగపడి తాము చేసిన పాపాలకు క్షమార్పణ అర్థించమని ఆయన వైపునకు మరలి రమ్మని బహుళంగా ప్రచారం చేశాడు. "సర్వేశ్వరుడు, కరుణామయుడు, వర్షాన్ని కురిపిస్తాడు; పొలాలు, తోటలు పండిస్తాడు, భీకర సముద్రం, ఉవ్వెత్తున లేచే తరంగాలు ఆయన మాటలు వింటాయి, ఆయనకు దాస్యం చేస్తున్నాయి. మీరు అనుభవిస్తున్న సుఖాల్ని, ఆస్తిపాస్తుల్ని, మీకు కలిగిన సంతానాన్ని ప్రసాదించింది ఆయనే. అలాంటి అమృతమయుడయిన దేవుణ్ణి ఎలా మరచిపోగలిగారు? మీకు ఉన్న రూప సంపదల్ని అర్థం చేసుకునే, విచక్షణ చేసే జ్ఞానాన్ని ఎవరిచ్చారు? మిమ్మల్ని ఎంత సుందరంగా, ఎంత సముచితంగా సృష్టించాడు! అంతులేని ఈ ఆకాశాన్ని, సువిశాలమయిన ఈ భూమిని, గగనవీధులలో విహరిస్తూ మానవుణ్ణి నిత్యం ఆకర్షిస్తూ ఉల్లాసపరచే ఈ సూర్య చంద్రుల్ని, తారల్ని ఎవరు సృష్టించారు? సూర్యుడికి వేడిని; చంద్రుడికి చలవను ఇచ్చింది ఎవరు? నేల నుండి మొక్కల్ని, మొక్కల్నుండి చెట్లను పుట్టించేదెవరు? భూమిపై మీరు నడుస్తున్నారు, తిరుగుతారు. అందమయిన భవనాలు కట్టి వాటిల్లో నివసిస్తూ, దేవుడిచ్చిన అనేక కానుకల్ని అనుభవిస్తూ సుఖంగా జీవిస్తారు. ఇన్ని విధాలుగా మిమ్మల్ని అనుగ్రహించి, పోషించే అల్లాహ్‌ను సేవించరూ?" అని సముదాయిస్తూ వారికి దివ్యబోధ చేశాడు హజ్రత్ నూహ్(అ).

దైవప్రవక్త నూహ్(అ) తన జాతివారితో ఇంకా ఇలా అన్నాడు: "మీకూ ఒక రోజు చావు వస్తుంది, ఇది తప్పదు. దైవ నిర్ణయం, మీ మరణాన్ని గురించి ఆలోచించుకోండి. భూలోకంలో శాశ్వతంగా ఉండటమనేది ఎవరికీ సాధ్యం కాదు. మరణం తరువాత ఆ ప్రభువు వద్దకే పోవాలి మీరు. మీరు చేసిన ప్రతి పని విచారించబడి మీకు తగిన ప్రతిఫలం యివ్వబడుతుంది. ఎల్లవేళలా మిమ్మల్ని వెంటాడే ఈ ప్రకృతి ధర్మాన్ని ఎరిగి ఉండి కూడా దైవోపదేశాలకు దూరంగా ఎందుకు పోతున్నారు మీరు? ఈ మీ వైఖరిలో ఎంత అవివేకం,

అజ్ఞానం ఉంది? మీ ప్రభువుకు మీకు మధ్య ఉన్న బంధం, బాంధవ్యం అభేద్యమయినది. ఆ బంధాన్నుండి తప్పించుకొని ఎటూ పోలేరు, చివరకు మిగిలేది- మీరు చావటం, ఆయన వద్దకు పోవడమే.

చెవిటివాని ముందు శంఖం ఊదితే ఏం లాభం. ఎంతో ఆర్ద్రంగా ప్రేమతో హజ్రత్ నూహ్ చేసిన దివ్య ప్రబోధాలు, పాపాలకు, దురాచారాలకు, దురహంకారానికి ఆటపట్టువుగా తయారయిన ఆ సమాజాన్ని మార్చలేకపోయాయి. ఐశ్వర్య మదంతో మత్తెక్కి ప్రపంచ వ్యామోహంలో పడ్డ సంఘ పెద్దల మాటలే, బోధనలే ఆ జాతి ప్రజలకు శిరోధార్యమయ్యాయి. ఈ సంఘ పెద్దలు తమ ధనాన్ని సంతానాన్ని చూచుకొని గర్వపడే వారు. హజ్రత్ నూహ్(అ) సందేశాన్ని స్వీకరిస్తే, తమ ప్రాపంచిక సౌఖ్యాలకు ఐశ్వర్యాలకు ఎక్కడ భంగం కలుగుతుందోనని, వారు రహస్యంగా, దైవప్రవక్తకు వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగారు.

హజ్రత్ నూహ్(అ) తన జాతి వారికి ఎడతెగకుండా 950 సంవత్సరాలు దైవోపదేశం చేశాడు. కాని ఆయన జ్ఞానబోధకు ప్రభావితులై, ఆయనకు సహచరులుగా మారిన వారిని వ్రేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. తుదకు నూహ్(అ) సందేశాన్ని అతని సొంత కొడుకు కూడా లెక్క చెయ్యలేదు. అతడు కాఫిర్లలో కలిసిపోయాడు. దైవప్రవక్తల మాటల్ని తిరస్కరించిన వారిని "కాఫిర్లు" (అవిశ్వాసులు) అంటారు. ఈ కాఫిర్లంతా హజ్రత్ నూహ్(అ)కు బద్ధవిరోధు లయ్యారు. హజ్రత్ నూహ్(అ) అందజేసిన అమర సందేశానికి వ్యతిరేకంగా ఒక పెద్ద ఉద్యమం తలెత్తింది. ధనమదాంధులు, దురహంకారులు అయిన జాతి నాయకులు ఈ ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. హజ్రత్ నూహ్(అ)ను ఎగతాళి చేసేవారు. వ్యంగ్యంగా మాట్లాడేవారు, అనేక విధాలుగా ఆయన్ని న్యూనతపరచటానికి యత్నం చేసేవారు, బలహీనులు, బానిసలు, క్రింది

తరగతికి చెందిన వారు తప్ప నూహ్(అ) సందేశాన్ని స్వీకరించి పరివర్తన చెందినవారు మరెవ్వరూ లేరు. ధనవంతులు, పెద్దలు అనబడే వారెవ్వరూ ఆయన మాటల్ని స్వీకరించలేదు. "ఈ అధముల్ని, ఈ నీచుల్ని యిక మీదట మనతోపాటు కూర్చోనివ్వరాదు" అని దుర్భాషలాడేవారు.

అధికారం, ఐశ్వర్యాల వల్ల దురహంకారులుగా తయారయిన యీ పెద్దమనుషుల మాటల్ని హజ్రత్ నూహ్(అ) వినేవారు, సహించేవారు కూడా. ఆయన తన విశ్వాసంలో, ధ్యేయంలో, కృషిలో అచంచలంగా ఉండేవారు. ఆయన ఏమి చేసినా తన ప్రభువు, యజమాని అయిన అల్లాహ్ సంతోషం కోసం చేసేవారు. ఇదంతా సృష్టికర్తకు తెలుసని ఆయనకు తెలుసు. కనుకనే ధైర్యాన్నీ, స్థయిర్యాన్నీ కోల్పోకుండా, నిస్పృహ చెందకుండా తన కర్తవ్యాన్ని దీక్షతో నిర్వహిస్తూ వచ్చారు.

దుర్మార్గం, అధర్మం, అన్యాయం ఎప్పుడూ స్థిరంగా ఉండవు. ఏ దేశ చరిత్ర చూచినా ఈ మహత్తర సత్యమే సాక్ష్యం పలుకుతుంది. దుర్నీతిపరులయిన ప్రజలు బాగుపడటానికి, ధర్మమార్గం వైపునకు రావటానికి దేవుడు కావలసినంత వ్యవధిని, అవకాశాన్ని యిస్తాడు. అంతవరకు వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంటాయి. దీని తరువాత వారిని నామరూపాలు లేకుండా చేస్తాడు.

"వినాశకాలే విపరీత బుద్ధిః" అన్నట్లు హజ్రత్ నూహ్(అ) జాతి వారికి వినాశకాలం దాపురించింది. ఆ జాతిని నిర్మూలించటానికే అల్లాహ్ నిశ్చయించాడు. త్వరలోనే తన జాతి ప్రచండ దైవశిక్షకు గురి కాబోతున్నదని దైవప్రవక్త నూహ్(అ)కు తెలుపబడింది. ఒక పెద్ద నావను కూడా తయారు చేసుకోవలసిందిగా అయనకు ఆజ్ఞాపించబడింది. ఆ నావ విధేయులయిన ముస్లిమ్‌లందరినీ, ఆ దేశంలో ఉన్న అన్ని జంతువులకు చెందిన ఒక్కొక్క జంటనూ మోయగలిగినదిగా ఉండాలి. దైవాజ్ఞానుసారం, హజ్రత్ నూహ్(అ)

పడవను తయారు చేయడం ప్రారంభించారు. సముద్రంగాని, పారే ఏరుగాని లేని మెట్ట ప్రదేశంలో దైవప్రవక్త నావను తయారుచేయడం వింతగా విచిత్రంగా కన్పించింది ఆ దేశ వాసులకు.

అజ్ఞానులయిన ఆ దేశ ప్రజలు హజ్రత్ నూహ్(అ)ను మరీ పరిహసించడం మొదలెట్టారు. "చూడండి! ఈ ముసలాయన నీళ్ళు లేని నేలపై నావను నడుపుతాడట" అని నవ్వుతూ పరాచికాలాడారు. అసలు విషయం హజ్రత్ నూహ్(అ)కు తెలుసనీ వారికేమి తెలుసు? "నవ్వకండి, ఎగతాళి చేయకండి. అతిత్వరలోనే తెలుస్తుంది అసలు విషయం ఏమిటో? అప్పుడు మేము మిమ్మల్ని చూచి నవ్వుతాము" అని అన్నారు నూహ్(అ).

ఆ దినం రానేవచ్చింది. కాఫిర్లపై దైవాగ్రహం, దైవశిక్ష అవతరించే రోజు అది. చూస్తూ చూస్తూ ఉండగానే ఆ ప్రదేశంలో 'చలమలు' పుట్టి నీటిని చిమ్మనారంభించాయి. మొదట "తన్నూర్" (రొట్టెలు తయారు చేసే ఒక పెద్ద పొయ్యి) నుండి నీరు ప్రవహించడం కన్పించింది. అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై కుండపోతగా వర్షం కురిసింది. కొద్దికాలంలోనే ఎటు చూచినా భూమి జలమయం అయింది. నదులు పొంగిపొరలాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. క్రమేపి ఆ దేశం వరదల్లో మునిగిపోసాగింది. దైవప్రవక్త నూహ్, అతని అనుచరులు మొదటే నావలో ఆసీనులయ్యారు. చివరిసారిగా నూహ్ తన కుమారుణ్ణి సంబోధిస్తూ, "చూడు నాయనా! ఇప్పుడన్నా ఈ దుర్మార్గుల సాంగత్యాన్ని వదులుకో, దైవాజ్ఞను శిరసావహించు, మా నావలోకి రా" అని ఆప్యాయంగా పిలిచాడు. కొడుకు దుస్థితిని చూచి తండ్రి హృదయం బ్రద్దలయింది. కాని వాడు ఆ తండ్రి మాటల్ని పెడచెవిన పెట్టాడు. "నేను కొండ పైకి పోయి ఆత్మరక్షణ చేసుకుంటాను" అని అన్నాడు ధీమాగా. హజ్రత్ నూహ్(అ) దుఃఖం పొంగిపొరలగా, "బాబూ! ఈ ప్రవాహంలో మునిగిపోకుండా

సురక్షితంగా ఉండటం ఎవరితరమూ కాదు. దైవరక్షణ లేని వాడెవడూ సురక్షితంగా ఉండలేడు" అని కొడుకును బ్రతిమాలాడు.

హజ్రత్ నూహ్(అ) తన కుమారునికి హితబోధ చేస్తూనే ఉన్నారు. ఇంతలోనే ఒక పెద్ద అల ఉవ్వెత్తున వచ్చి అతణ్ణి అగాధంలోకి త్రోసుకుపోయింది. ఆ ప్రదేశమంతా మునిగిపోయింది. అందరూ కొట్టుకుపోయారు. సర్వేశ్వరుని కటాక్షం దైవవిధేయుల్ని రక్షించింది.

హజ్రత్ నూహ్(అ) దేవునితో, "ఓ ప్రభూ! నా ప్రియ కుమారుడు కూడా మునిగిపోయాడు. నన్నూ నా వారిని రక్షిస్తానని వాగ్దానం చేశావే! నా కుమారుణ్ణి రక్షించు" అని వాపోయాడు. భగవత్‌వాణి పలికింది. "లేదు, వాడు నీ వాడు కాదు. దైవ ధిక్కారులలో కలిసిపోయాడు. దైవాజ్ఞల్ని ఉల్లంఘించాడు. నీవు ఈ విషయాన్ని అర్థం చేసుకోలేకపోయావా, పైపెచ్చు మూర్ఖుడయిన పుత్రుణ్ణి రక్షించమని వేడుకుంటున్నావా?"

దైవప్రవక్త నూహ్(అ)కు అతని ప్రేమ వల్ల ఆవరించిన విస్మరణ పటాపంచలయింది. తన తప్పును గ్రహించి, క్షమించమని దైవాన్ని ప్రార్థించాడు. కలిగే ఫలితాలకు, పరిణామాలకు చేసే పనులే ప్రాతిపదికలు. ఎవరయినా సరే. అతను ప్రవక్త కొడుకే కానివ్వండి. చేసిన పాపాలకు తగిన ఫలితం దొరకక మానదు. నావలో ఉన్న దైవభక్తులు తప్ప, అందరూ వరదల్లో కొట్టుకు పోయారు. వాన వెలిసింది. భూమిపై ఉన్న నీరు ఇంకిపోసాగింది. జలప్రళయం పరిసమాప్తమయింది. హజ్రత్ నూహ్(అ) నావ "జూదీ" అనే పర్వత ప్రాంతానికి సురక్షితంగా చేరుకుంది. నావలోని వారందరూ బయటికి వచ్చారు. వారి అదృష్టం పండింది. వారి జీవితం సఫలమయింది. దేవుడు వారిని అనుగ్రహించాడు. దైవం ప్రసాదించిన అనేక అపూర్వ కానుకల్ని, వరాలను అనుభవిస్తూ దైవ విధేయులై సుఖశాంతులు విలసిల్లే జీవనాన్ని గడుపసాగారు. ధర్మం రాజ్యం చేయసాగింది. దేవుని భూమిపై, దైవాదేశాలు చెల్లసాగాయి.

ఎవరినయితే ప్రపంచం ఒకప్పుడు నీచులుగా, క్షుద్రులుగా పరిగణించిందో వారే దానికి ఏలికలు, యజమానులు అయ్యారు.

మరువరాని విషయాలు

1. చెడును నిత్యం చేస్తూ ఉండటం మూలాన క్రమంగా మనిషి ఎంత మారిపోతాడు, మంచి మాటలు ధర్మ బోధలు అతని బుర్రకెక్కవు.

2.దుర్నీతిపరులయిన ప్రజల్ని రుజుమార్గం వైపునకు రమ్మని ఆహ్వానించడం సులభమయిన పనికాదు. సహన స్థయిర్యాల పర్వతాలు కూడా నీరయిపోయే కార్యం, ఈ కార్యాన్ని చేపట్టిన మనిషి ఎన్నో కష్టాలను సహించవలసి ఉంటుంది.

3. దైవ భక్తులు, సదాచార పరాయణులు తోటి మానవులకు సన్మార్గాన్ని, నిజ ధర్మాన్ని చూపుతారు, తన మాటల్ని ఫలానా వారు స్వీకరించటం లేదే, ఆ విధంగా నడుచుకోవటం లేదే అని వారు విచారించరు. నిర్భయంగా, నిరంతరం వారు ఆ పనిని చేసుకుంటూ పోతారు. హజ్రత్ నూహ్(అ) ఈ పనినే 950 సంవత్సరాలు చేశారు.

4. దుర్జనులు సజ్జనులుగా మారటానికి, దుర్మార్గాన్ని వదలి ధర్మమార్గం వైపునకు మరలటానికి దేవుడు మానవులకు ఎన్నో అవకాశాలు, ఎంతో వ్యవధి ఇస్తాడు. దైవవిధేయులుగా మారే సూచనలు ఏ మాత్రం కానరాని పక్షంలో మానవులపై దేవుని కొరడా దెబ్బలు పడుతాయి. దైవశిక్ష వారిని సావధాన పరుస్తుంది. లోకం నుండి దుష్టులు, పాపులు నిష్క్రమిస్తారు.

5. చివరకు మిగిలేది, ఫలితం దక్కేది మనిషి తాను చేసే కర్మల పర్యవసానమే. మన తల్లిదండ్రుల, తాత ముత్తాతల ధనరాశులు, ధర్మనిరతి. సత్యసంధత ఏ విధంగానూ మనకు ఉపయోగపడవు.

హజ్రత్ హూద్ (అలైహిస్సలాం)

దైవప్రవక్త హజ్రత్ నూహ్(అ) పరమపదించారు. ఆయన తరువాత ఉనికిలోకి వచ్చిన "ఆద్" జాతికి ప్రపంచంలో అత్యున్నత స్థానం లభించింది. వారికి దేవుడు విరివిగా వరాలిచ్చాడు. కావలసినంత ఐశ్వర్యం, భువికి ఆధిపత్యం వారికుండేవి. బంగారం పండే భూములు, పెద్ద పెద్ద తోటలు, ఎత్తయిన అందమయిన భవనాలు, సుఖశాంతులు విరాజిల్లే జీవితం, ఇంకా వీటికి తోడు అధికారం ఉండటం వల్ల అన్నివిధాలా అత్యంత శక్తిమంతమయిన జాతికి అలరారింది ఆద్ జాతి. కాని ఆ జాతివారు వారికున్న ఈ అధిక్యతను చూచుకొని గర్వపడేవారు. బలహీనుల్ని, నిరుపేదల్ని హింసించేవారు. వారు చేయని దురాగతాలు, సలుపని అత్యాచారాలు లేవు. వారికి గర్వకారణమయిన ఐశ్వర్యసంపద వారిని దైవ మార్గాన్నుండి వేరుచేసింది. నిజ దైవాన్ని మరచి, వందలాది దేవతలను, విగ్రహాలను సృష్టించుకొని పూజించేవారు. వారనుభవించే భోగభాగ్యాలు శాశ్వతాలని నమ్మి, వారికిక చావే లేదనే విధంగా వారు జీవించసాగారు.

అన్యాయం, అధర్మం, అరాచకం చెలరేగాయి. దైవభయం, దైవభక్తి, సత్యం, సౌశీల్యం కరువయ్యాయి, మూఢాచారాలకు పుట్టినిల్లుగా, అవినీతికి ఆలయంగా, అనాచారాలకు అత్యాచారాలకు ఆకర్షంగా ఉండే ఆద్ జాతికి మంచి మార్గం, దైవ మార్గం చూపించటానికి దయామయుడయిన దేవుడు ఒక ప్రవక్తను అవతరింపజేశాడు. ఆయన పేరే హజ్రత్ హూద్(అ).

హజ్రత్ హూద్(అ) తన జాతిని దైవమార్గం వైపునకు ఆహ్వానించాడు. "పూజకు, ఆరాధనకు అర్హుడు అల్లాహ్ ఒక్కడే. ఏ దేవికీ, ఏ దేవతకూ ఈ యోగ్యత లేదు. మనిషి ఒకే దేవునికి దాసుడు. దైవ ప్రబోధాలే మానవునికి

శిరోధార్యాలు, దైవేతరుల ఆజ్ఞల్ని పాలించినందువల్ల మానవ జీవితం సుఖవంతం ఆరోగ్యవంతం కాజాలదు. ఆధిక్యత దైవాజ్ఞలకే ఉండాలి. దైవేతరుల ఆజ్ఞలకు కాదు. అందర్నీ సృష్టించినవాడు, అందరికీ యజమాని, ప్రభువు అల్లాహ్ ఒక్కడే. బలహీనుల్ని బానిసలుగా చేసే, వారిని హింసించి, వారిపై దౌర్జన్యం చేసే హక్కు, అధికారం ఎవ్వరికీ లేవు" అని ఉద్బోధించారు హజ్రత్ హూద్(అ).

జాతికి నాయకులుగా చెలామణీ అయ్యే పెద్ద మనుషులకు కోపాన్ని కలిగించాయి హూద్(అ) మాటలు. వారు హూద్(అ)తో, "ఓ హూద్! నీకు బుద్ధి, జ్ఞానం ఏ మాత్రం లేవు. నీవనే మాటలన్నీ బూటకాలు, నీవే వాటిని సృష్టించావు" అని తూలనాడారు.

హజ్రత్ హూద్(అ) చలించలేదు, నిర్భీతిగా కొండలా నిలబడి వారితో అన్నారు, "సోదరులారా! మీరనేది యదార్థం కాదు. నేను దైవ ప్రవక్తను, నేను మీతో అన్న మాటలన్నీ సకల లోకాలను సృష్టించిన అల్లాహ్ తరపున అంటున్నాను. మీ యోగక్షేమాల కోసం అంటున్నాను. సర్వసృష్టిని పరిపోషించి పాలించే దేవుని వైపునకు తరలి రమ్మని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. నూహ్(అ) జాతి అంతమయిన తరువాత, మిమ్మల్ని ఈ భూమికి వారసులుగా, యజమానులుగా చేసింది దైవమే. నూహ్(అ) జాతి చరిత్ర మీ అందరికీ తెలుసు. దైవప్రవక్త నూహ్(అ) మాటల్ని వారు విశ్వసించలేదు. మంచిని కాదన్నారు, చెడును గౌరవించారు. దేవుడ్ని మరచిపోయారు. దాని పర్యవసానం? భయంకరమయిన వరదలకు గురి అయి సర్వనాశనమయ్యారు. ఆ ప్రభువే, ఆ దైవమే, మీకు శక్తిని, ధనసంపత్తినీ ఇచ్చాడు. దైవానికి విధేయులయి జీవించకపోతే ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. మిమ్మల్ని రక్షించేవారెవరూ ఉండరు."

ఆద్ జాతి సర్దార్లు, నాయకులు, హూద్(అ) ప్రారంభించిన ఉద్యమంలోని సారాన్ని గ్రహించారు. కాని వారిలో మార్పు రాలేదు. కుతర్కాలకు దిగారు,

"మేము అవలంబించే మతం, అనుసరించే విధానం చాలా పురాతనమయినవి. మా తండ్రి, తాతల కాలము నాటివి. వాటిని మేమెలా తృణీకరించగలము? మా పెద్దలు చేస్తూ వచ్చిన పనుల్ని, మాకు వారు నేర్పిన మాటల్ని తప్పు అని ఎలా అనగలము? ఈ దేవీదేవతల్ని పూజిస్తూ వచ్చిన మా వాళ్ళు బుద్ధిలేని వాళ్ళా?- లాభం లేదు, మేము నీ మాటల్ని నమ్మలేము" అని జవాబిచ్చారు.

హజ్రత్ హూద్(అ) సంఘ సంస్కరణకు కంకణం కట్టుకున్నాడు. వారితో అన్నాడు, "సోదరులారా! పెద్దల అడుగుజాడల్లో కళ్ళు మూసుకొని నడవడం మంచిది కాదు. తెలివినీ, వివేకాన్ని మీకూ ఇచ్చాడు దేవుడు. వాటిని ఉపయోగించండి. నేను అనే మాటలు సత్యదూరాలేమో ఆలోచించండి. నేను ఎప్పుడూ ఏదీ మిమ్మల్ని కోరలేదే. స్వార్థ బుద్ధితో ఈ మాటల్ని నేను మీతో అనటం లేదే. నా మాటల్ని వినండి; నమ్మండి; యోచించండి. నా హెచ్చరికను మీరు లక్ష్యపెట్టకపోతే, నన్ను ఎగతాళి చేసి నా మాటల్ని తేలికగా తీసుకుంటే, ఈ జగత్తుకు ప్రభువైన దేవుడు, పూర్వం తనకు అవిధేయత చూపిన వారిని ఏ విధంగా సర్వనాశనం చేశాడో, అదే విధంగా మిమ్మల్ని నామరూపాలు లేకుండా చేస్తాడు. ఆయన పంపిన ఉపదేశాలను వినీ విననట్లుగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే దాని ఫలితం చాలా దారుణంగా ఉంటుంది."

ఆ జాతి ప్రజల కళ్ళు, చెవులు, మనస్సులు ఐశ్వర్యమదంతో మూతబడ్డాయి. భోగలాలసులయిన వారికి హజ్రత్ హూద్(అ) మాటలు, హెచ్చరికలు వింతగా, విచిత్రంగా కన్పించాయి. వికటంగా నవ్వుతూ పరిహాసమాడుతూ దైవప్రవక్తతో వారు అన్నారు, "ఓ హూద్! మేము పూజించే ఏ దేవత ఆగ్రహానికో నీవు గురి అయ్యావు. ఆ దేవత పిడికిలి దెబ్బ నీ మీద పడి ఉండాలి. నీ బుర్ర చెడిపోయింది. అందుకే నీవు ఆ విధంగా ఏదేదో వాగుతున్నావు. పైగా నీవు దైవ శిక్ష, దైవాగ్రహం అని మమ్మల్ని బెదిరిస్తున్నావు. మంచిది, ఆ

శిక్షను అవతరించమను చూద్దాం. మేము నీ మాటల్ని విశ్వసించం. ఇలాంటి బోధలు గతంలో మేము చాలా విన్నాము."

ఆద్ జాతి చూపిన ఈ నిర్లక్ష్య వైఖరికి దైవప్రవక్త హూద్(అ) అధైర్యపడలేదు. ఈ మహోద్యమంలో ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా, సంఘం ఎంత వెలివేసినా, అచంచలంగా, నిర్భయంగా మహాపర్వతంలా నిలబడి దైవ చింతన ప్రచారం చేశాడు హజ్రత్ హూద్(అ). కొద్దిమంది మాత్రమే తన మాటల్ని విశ్వసించారు. మిగిలిన వారంతా తమ పూర్వ స్థితికే అంటుకుపోయారు.

హితోపదేశం ఎంత కాలం వరకు ఎన్ని విధాలుగా జరగాలో, అంత కాలం వరకు అన్ని విధాలుగా జరిగింది. దానికీ కొన్ని పరిమితులుంటాయి. ఆద్ జాతిలో దైవప్రవక్త సందేశాన్ని విని స్వీకరించేవారు ఇక ఎవ్వరూ లేరని స్పష్టమైంది. అప్పుడు అల్లాహ్ దురహంకారానికి లోనయిన ఈ జాతిని శిక్షించటానికి నిశ్చయించాడు.

ఒక రోజున ఆకాశాన్ని మబ్బులు ఆక్రమించాయి. వర్షం కురుస్తుందని ఆశించి సంబరపడ్డారు జనం. అదీగాక ఆ సమయంలో పంటలు పండటానికి వర్షాలు చాలా అవసరం. ఏ మబ్బుల్ని చూసి వాళ్లు ఆనందంతో పరవశం చెందుతున్నారో ఆ మబ్బులు వారిని ఘోర అపాయానికి గురిచేస్తాయనీ కఠినంగా శిక్షిస్తాయనీ వారికేమి తెలుసు పాపం! దేనినయితే పిలువమని, అవతరింపజేయమని దైవప్రవక్త హూద్(అ)ను వారు త్వం పెట్టేవారో ఆ ప్రళయం వచ్చిపడింది. అది వర్షాన్ని కురిపించే మేఘం కాదు. కల్లోలాన్ని రేపే పెను తుఫాను. దైవ ధిక్కారుల్ని, దైవ ద్రోహుల్ని భూస్థాపితం చేయటానికి దేవుడు పంపిన ఉప్పెన. అలాంటి తుఫాన్ను ఆద్ జాతి ప్రజలు అంతవరకూ కనీవినీ ఎరుగరు. ఆ గాలి, వాన ఏడు రాత్రులు, ఎనిమిది దినాలు ఎడతెగకుండా మహా భయంకరంగా వీచింది, ప్రతి వస్తువు తన స్థానాన్ని తప్పింది. ఎత్తయిన

భవనాలు, మహావృక్షాలు అన్నీ కూలి దూరదూరంగా పడిపోయాయి. వికటాట్టహాసం చేస్తూ, బీభత్సంగా వీచిన ఆ పెను తుఫాను వల్ల ప్రాణాల్తో బయటపడ్డ వాడెవ్వడూ లేడు. దైవప్రవక్త హూద్(అ) మరియు తన అనుచరులు మాత్రమే సురక్షితంగా ఉన్నారు. తతిమ్మావారంతా దుర్మరణానికి గురి అయ్యారు. ఆ భయంకర దృశ్యాన్ని చూస్తే అక్కడ మనుష్య జాతి కూడా ఉండేదా అనిపించేది.

అహంభావానికి, అహంకారానికి లోనై కఠిన దైవ శిక్షకు గురియైన ఆద్ జాతి శిథిలావశేషాలు చరిత్రాత్మకంగా ఇప్పటికీ మిగిలిపోయాయి. ఈ జాతి ప్రజలు అరేబియా ఖండంలోని దక్షిణ ప్రాంతంలో ఉండేవారు. పవిత్ర దైవగ్రంథం ఖుర్ఆన్ అవతరిస్తూ ఉన్నప్పుడు, అరబ్బువాసులు ఈ ప్రదేశాన్ని చూస్తూ ఉండేవారు కూడా. మహాశక్తిమంతమయిన జాతికి, ఘోర దైవ శిక్షకు గురియైన జాతికి ఒకప్పుడు ఈ ప్రదేశం నివాస స్థలంగా ఉండేదని కూడా వారికి తెలుసు.

మంచి మాటలు, మరువరాని మాటలు

1. ఐశ్వర్యమదంతో మత్తెక్కిన మనిషి సాధారణంగా దేవుణ్ణి మరచిపోతాడు. తన బుద్ధికి తోచినట్లుగా, అనేక వస్తువుల్ని, శక్తుల్ని దేవుళ్ళుగా కల్పించుకొని వాటి ముందర తన శిరస్సును వంచుతాడు.

2. మానవుడు దైవదాసుడు, జీవిత పర్యంతం దైవదాస్యం (సేవ) చెయ్యాలి, దైవాజ్ఞల్ని శిరసావహించాలి.

3. దైవదాస్యం చేయటానికి మార్గదర్శకులయిన దైవప్రవక్తలు బోధించిన ప్రతిదీ ఆచరించటం చాలా అవసరం. అది చేయకుండా దైవ విధేయత చేయడం సాధ్యం కాదు.

4. మన తండ్రులు, తాతలు చెప్పిన మాటలు, చేసిన బోధలు నిజం కావచ్చు, కాకపోవచ్చు. వారి మంచి మాటల్ని స్వీకరించాలి. వారి చెడు మాటల్ని పరిత్యజించాలి.

5. ఎడతెగకుండా దైవానికి అవిధేయులయి జీవించటం వల్ల కలిగే పరిణామాలు విధ్వంసం, వినాశం. అలా జీవించిన జాతి త్వరగానో, ఆలస్యంగానో దైవశిక్షకు గురికాక తప్పదు.

6. గత చరిత్రలు మనకు అపూర్వ గుణపాఠాలను నేర్పుతాయి.

-: సమాప్తం :-